


వాళ్ళిద్దరూ కవలలు
బైటికి కనిపించరు గాని
ఒకరిలో ఒకరున్నారు.
ఇద్దరిదీ ఒకటే చైతన్యం!
వాళ్ళిద్దరికీ కలిపి పెట్టిన పేరు ఒకటే —
'నేను'!
కానీ, కాలం గడిచిన కొద్దీ
వాళ్ళకు రెండు వ్యక్తిత్వాలు ఏర్పడ్డాయి.
రెండు దృక్పథాలూ
రెండు నాలుకలూ ఏర్పడ్డాయి
ఒకరు తూర్పు అంటే
మరొకరు పడమర అన్నారు.
ఒకే చైతన్యం రెండు ముక్కలైంది!

'నేను అనుభవించేవాణ్ని' అన్నాడు కామరాజు.
'నేను ఆలోచించేవాణ్ని' అన్నాడు గోలరాజు
ఎవరి పేరు వాళ్ళు పెట్టుకున్నారు
ఎవరి దారి వాళ్ళు చూసుకుందామనుకున్నారు
కాని- కామరాజు అనుభవిస్తుంటే గోలరాజు బుర్ర గిరికీలు కొట్టించాడు కామరాజు.

వాళ్ళిద్దరూ కవలలు.
ఒకప్పుడు ఒకే చైతన్యంలో కలిసున్నారు.
కానీ, నేడు వేరయ్యారు.
రెండయ్యారు.
జీవితాన్ని ముక్కలు చేసుకున్నారు.

* * *

ఆరేళ్ళప్పుడు—
అంగడి!
అంగట్లో గోళీలు.
రంగురంగుల గోళీలు.
తెలుపూ నలుపూ
ఎరుపూ నీలం.....
రంగురంగుల వాసనలు!
గోళీల మనసు స్పర్శల విరహం చేతి వేళ్ళకి!
తళుక్కుమంటూ చూస్తున్నాయ్.
గాజు సీసాల్లోంచి దొర్లిపోయేందుకు
వాటి గుండ్రాలు సిద్ధంగా ఉన్నాయ్.

ఒకసారి అటూ ఇటూ చూసి చటుక్కున నాలుగు గోళీలు జేబులో వేసుకొని పరుగెత్తాడు కామరాజు!

దొంగతనం దొంగతనం....

బళ్ళో ప్రతిరోజూ సాయంత్రం చిలక పలుకుల్లా పలికించే నీతి వాక్యాలు గోలరాజు చెవుల్లో గింగురుమన్నాయి.

దొంగతనం చేయరాదు.

దొంగతనం చేయరాదు.

అంతే! గోలరాజుకి అయ్యవారి దయ్యం పూనింది. కత్తెర చేత్తో పట్టుకొని 'సెన్సార్' అని అరుస్తూ గోళీలు జేబులో వేసుకుని పరుగెత్తే కామరాజు వెంటపడ్డాడు.

ఇతర్ల పుస్తకాలు తియ్యరాదు.
ఇతర్ల పెన్సిళ్ళు ముట్టరాదు.
ఇంట్లో డబ్బులు దొంగిలించరాదు.
దొంగిలించారో....
నాకు తెలిసిపోయిందో....
వీపు చీరేస్తాను.
చర్మం ఒలిచేస్తాను- అంటూ
గోలరాజు బోధించాడు
గోలరాజు బెదిరించాడు.

సెన్సార్ సెన్సార్... అనే అరుపుల్ని మోసుకుంటూ కామరాజు పరుగెత్తుతున్నాడు. అట్ల కొంచెం సేపు పరుగెత్తి తనను తరుముకుంటూ వచ్చేది అయ్యవారి భూతమే గాని అయ్యవారు కాదు గదా' అని ధైర్యం తెచ్చుకున్నాడు. జేబులో నుంచి గోళీలు బైటికి తీశాడు.

గాజు గోళీల్లో పువ్వుల డిజైన్లు
బంగారు జింకలా సమ్మోహపరుస్తున్నాయ్!
ఆ పువ్వు కోసం....
ఆ బంగారుజింక కోసం.....

గోళీని రాయి మీద పెట్టి మరో రాయితో పగులగొట్టాడు.

అది ఆకుపచ్చ గోళీలో
నలుపు రంగు పువ్వు!
గోళీ ముక్కలుగా పగిలింది.
పువ్వు విరిగిపోయి
పగిలిన గాజు ముక్కల్లోకి తప్పించుకుంది.

వాన్ని సెన్సార్ చెయాల్సిన నీడా,
నీని నీడ వదిలించుకోవాలని వాడూ—
ఇద్దరి మధ్యా ఎప్పుడూ ఏదో ఒక తగాదా!
సుఖం దొరకదు.
బంగారుజింక అందదు.

* * *

పదేళ్ళప్పుడు—

మధ్యాహ్నం బడి ఎగ్గొట్టి మడికట్ల వైపు పరుగెత్తాడు. వంకలో ఈతలు కొట్టి వస్తుంటే చచ్చిపోయి వెల్లకిలా పడున్న ఒక కప్ప తెల్లగా మెరుస్తూ కనిపించింది బురద గుంటలో

కప్ప ఎప్పుడూ బట్టలు తొడుక్కోపోయినా దాని కడుపు భాగపు తెల్లని చర్మం కనిపించగానే దాని నగ్నత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది; ఎందుకో! ఆ కడుపు భాగం కళ్ళకు తరుచుగా కనిపించకుండా ఉండడమే అందుకు కారణమేమో!

కప్పలన్నింటినీ అట్లా వెల్లకిలా చేసి నగ్నంగా మెరిసే—
ఆ లేత చర్మంలోని తెలుపును చూడాలని ఏదో బలమైన కోర్కె.

తెలుపు తెలుపు
దాచుకున్న చర్మంలో తెలుపు!
నగ్నత్వపు తెలుపు కాంతిలో నలుపు!
తెలుపు నలుపు
నలుపు తెలుపులు రేపే
కుతూహలం!
కలవరం!

పక్కనున్న రాళ్ళు ఏరుకుని ఒక్కో కప్పనూ గురిచూసి కొడుతున్నాడు. కప్పలు ఒక్కొక్కటే చచ్చి వెల్లకిలా తిరిగి పడి తేలుతూ, తెల్లని పొట్టల్ని అచేతనంగా వాల్చేస్తుంటే ఏదో మోహం! రాళ్ళ దెబ్బలు పడి పడి పైకి చింది గాలిలో వ్యాపించే బురద వాసనలో ఏదో ఉత్సాహం!

'పాపం! పాపం! నోరులేని జీవుల్ని చంపితే పాపం' నాయనమ్మ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. అంతే!

గోలరాజుకి వాళ్ళ నాయనమ్మ దయ్యం ఆవేశించింది!!

'ఇక్కడ నువు చేసే పాపాలకి సలసల కాగే నూనెలోకి తోస్తారు నరకంలో. ఎర్రగా మండే ఇనుప స్తంభాల్ని కౌగిలించుకోమంటారు. కాళ్ళ నుంచీ తల వరకూ శరీరాన్ని తుండ్లు తుండ్లుగా నరికి కైమా చేస్తారు- గోలరాజు గొంతులోంచి వాళ్ళ నాయనమ్మ గొంతు ఏకధాటిగా అరుస్తోంది. టేప్ రికార్డర్‌లా మారుమోగిపోతుంది. కప్పలు చంపినందుకు నరకంలో పొందబోయే శిక్షల లిస్టును ఆవేశంగా ఒప్పజెప్పుతోంది.

కాని వాడు వింటేనా? గురి ఫలించినప్పుడల్లా ఇనుమడించిన ఉత్సాహంతో వీరత్వంతో కప్పల్ని అలా చంపుతూనే ఉన్నాడు.

ముందు తరాల నుంచి కొట్టుకొచ్చి శరీరంలోని నెత్తుటి గొట్టాల్లో రొదచేస్తూ మూల్గే ఏవేవో చీకటి ఆకారాలకూ, ఉద్రేకాలకూ రూపాలు కల్పించుకునే తహతహలో కామరాజు ఒకవైపూ.....

నరకం గూర్చిన భయంతో ఆ ఆవేశాల్నీ ఉద్రేకాల్నీ కత్తిరించాలని చూస్తూ, తలపు తలపులో జీవితపు ప్రతి కదలికలో గొంగళిపురుగులా ప్రవేశించి మనిషి బాహ్య ప్రవర్తనను కొంచెం కొంచెం కొరుక్కుతినే ప్రయత్నం చేసే గోలరాజు ఇంకొకవైపూ...

ఇద్దరి మధ్యా నిరంతర సంఘర్షణ!!

'వాడు స్వర్గానికి పోతే తనకేం? నరకానికి పోతే తనకేం? కాని వాడు నరకానికి పోతూ పోతూ తనను కూడా లాక్కుపోతాడు' అని భయపడతాడు గోలరాజు.

ఇద్దరు కప్పుకున్నదీ ఒక శరీరమే! ఇద్దరు జీవిస్తున్నదీ ఒక ఉనికిలోనే! కష్టమూ నష్టమూ ఎప్పుడు ఏమొచ్చినా ఇద్దరూ సమానంగా భరించాల్సిందే! చివరకు చావు వచ్చినా సరే, ఇద్దరూ కలిసి పంచుకోవలసిందే. ఖర్మ! అని నుదురు బాదుకుంటాడు.

* * *

పాతికేళ్ళప్పుడు—

ముఖ కవళికల్లో ప్రవహించే రహస్యపు భాష.
ప్రేమ లేఖల మడతలు విప్పి చూస్తే మోహపు మంటల ఆవిర్లు
ఆడపిల్లల్లో అదృష్టాలు వెతుక్కుంటూపోయే
సాయంత్రపు షికార్లు
ఏ ప్రియురాలో
తన యవ్వన తపస్సును ధారపోస్తానంటే
గోడలు దూకిన రాత్రులు

సుఖం సుఖం! వాడు సుఖం కోసమే బతుకుతాడు. తన మార్గానికి అడ్డొచ్చిన ఏ నీతి నియమాలైనా సరే తుంగలో తొక్కేసి పోతాడు. కాని సంఘమంటే భయం భయం. తన చీకటి రహస్యాలు కాపాడుకుంటే తప్ప దొరకదు దాని అభయ హస్తం!

సంఘ భయం దయ్యమై పూనింది గోలరాజుకి!!

'విను. నా మాట విను. ఆ పిల్లవైపు చూడొద్దు. ప్రమాదం కనుక్కుంటే నరికేస్తారు. ముక్కలుగా తరిగి ఆవకాయ జాడీలో ఊరేస్తారు' అంటూ బెదిరించాడు.

'నీ అవినీతి రచ్చకెక్కితే నలుగురిలోనూ ఎంత అప్రతిష్ట
సంఘం వేలెత్తి చూపితే మన హోదా ప్రిస్టేజీ ఏం కాను? అంటూ ఘోషించాడు

'నిన్ను ఎలా మార్చడం? గొప్ప గొప్ప విలువల్లోకీ ఆశయాల్లోకీ ఆధ్యాత్మిక ఔన్నత్యం లోకీ నిన్ను సుఖాపేక్షను ఎలా ఒదిగించడం?' అంటూ జుట్టు పీక్కున్నాడు.

'చర్మంలోంచి తొంగిచూసే ఆ కళ్ళ ఆకర్షణా, రక్తంతో తడిసినట్లుండే ఆ పెదాల దాహం, భరించలేని బాధతో అర్పించుకుని నలిగిపోజూసే ఆ పాలిండ్ల గట్టిదనం... ఆ స్వర్గమేదో చూడనీ, ఆ సుఖానికి అంతు కనుక్కోనీ' అంటూ గింజుకుంటున్నాడు కామరాజు.

రక్తం మరిగి మరిగి నరనరాల్లో పోటెత్తి తొక్కులాడే ఎదజేసిన అంబోతులా రెచ్చిపోతూ కాళ్ళని కాళ్ళూ, చేతుల్ని చేతులూ, ముఖానికి ముఖమూ, ఛాతీ కింద

## పోరాటం నాదే

నా మూపుల్లో చురకత్తుల్ని దించి
నా మెదడులో సీసం పోసి
నా దేహాన్ని ఖండ ఖండాలుగా నరికి
నీ దాహానికి బలిదానం చెయ్యాలన్న
ఓ 'వ్యక్తిత్వ'మా — జోహారు!

ముక్కలైన దేహంలోని
ప్రతి ముక్కలోనూ
చిట్లిన నా మెదడులోని
నరనరంలోనూ

నా తల్లి ఉగ్గు గిన్నెలో
రంగరించిన తిరుగుబాటు జ్వలిస్తోంది
ప్రతి అడుగునీ నిలదీయమన్న
నా తల్లి చనుబాల స్పర్శ
నన్ను స్పృశిస్తూనే వుంది

ప్రతిఘటనే జీవితంగా
బతుకు పోరాటాల్ని కన్నానందుకే
అందుకే
నా సమాధికి పునాదులు
వెయ్యాలనుకున్న ఓ అధికారమా
జీవితమే రణరంగంగా
నీతోనా పోరాటం
ఇదే నా నినాదమూ
బహుశ గెలుపు నీదే కావచ్చు
పోరాటం మాత్రం నాదే.

— నల్లూరి రుక్మిణి



అర్ధరాత్రికి అటూ ఇటుగా
నాలోకి నేను ఇంకిపోయి
అణువుగా పరమాణువుగా
రూపాంతరం చెందుతున్నప్పుడు
ఒక విస్ఫోటనం!
కకావికలయిన శకలాల్ని ఏరుకుని
జ్ఞాపకాల గుదిగుచ్చి
మిగిలిన అర్ధంలోకి, అనంతంలోకి
జారిన ప్రతిబింబంలాగా
చెల్లా చెదురుగా ...
శిథిల వాంఛా శకలాల మధ్య
శిలీంద్రా లేరుకున్నట్లు
సంక్షోభం ఆ ఒడ్డున
నిలిచిన ఛాయలాగా గతం
అందని అర్ణవం లాంటి భవిష్యత్
పురుగులా తొలుస్తున్న
వర్తమానం తలంపొకటి
'పురుగులా నీ మొఖాన్ని
గాజు కిటికీకేసి కొట్టుకుని కుళ్లిపో'
మనసొకటి
నిర్వ్యాపకమే నిశ్చలనిరత అయినప్పుడు
మన్నూ, నేనూ కలబోసుకున్న
స్వప్నాలు చెల్లా చెదురైనప్పుడు
వికసించిన ఆనందాలూ లేవు ...
నడిగాపులు పడే
అద్భుతాలూ జరగవు ...
'మనిషిలోనూ, చేపలోనూ
కుళ్లడం మెదడులో ప్రారంభం అగును'
అవునా! ఇవ్వాళ
ఈ కుంపటి మీద కూచున్న
వధ్య శిలమీద తల దించిన
యువతా! నీ మారు పేరు
నిర్వీర్యతా?
ఎటు? ఎటు? ఎటు? ఎటు?
ఎటో ఒక దిక్కు నడూ ...

— స్వశోష

పాలిండ్లూ నొక్కుకుంటూ అదుముకుంటూ రెండు మూడు నిమిషాల్లోనే కోర్కెల మొలకలు టపటప తెంచుకుని నివృత్తునిగా పారిపోయే అలవాటు ఉద్రేకం కల్పిస్తుంటే తన మీద గోలరాజు బిగించిన బోధనా ముద్ర పట్టులోంచి పారిపోవాలని పెనుగులాడుతూనే ఉన్నాడు.

ఇద్దరి మధ్యా నిరంతర యుద్ధం!!!

ఇంద్రియాల కంతల్లోంచి తప్పించుకుని పారిపోవాలని వాడు! పారిపోయేవానికి పగ్గం వేసి సంఘానికీ లోకానికీ కట్టి పడెయ్యాలని వీడు!!!

వాని ముఖాన్ని వీడు కత్తిరిస్తూ!

వీని శాంతిని వీడు ధ్వంసం చేస్తూ!

ఇద్దరికీ లేవు- సుఖ శాంతులు!!

ఎవరు నిజం?

ఎవరు నీడ?

ఇద్దరి మధ్యా ఈ 'ద్వంద్వ' యుద్ధం ముగిసేదెలా?

ఎంతగా పోట్లాడితే అంతగా పెరుగుతోంది వాళ్ళ బలం!

ఎంతగా తరగబడితే అంతగా హెచ్చుతోంది వాళ్ళమధ్య అగాధం!

ఎవరికివారు తోచినట్లుగా బతకడానికి వీల్లేని పరిస్థితి.

ఒకరిలో ఒకరుగా కలిసి ఏకమైపోతే తప్ప లేదా విముక్తి?

* * *

గోలరాజు అరుపులు మానాడు.

పెవ్వార్ కత్తెరను సైడుకాలువలోకి విసిరికొట్టాడు.

అంతే! హఠాత్తుగా నగ్నమైపోయి
ఒళ్ళు విరుచుకున్నాడు కామరాజు!
ఆశ నుంచీ ఆశ పైకి
కోర్కె నుంచీ కోర్కె పైకి
ఎగురుతున్నాడు
దూకుతున్నాడు
నవజ ముఖం, నీరజ కంఠం
విశాలాక్షి కన్నులూ, సుబ్బులక్ష్మి చన్నులూ

ఆమె నడుంలోని ఒంపూ, ఈమె తొడల్లోని నునుపూ... అన్నిటి వైపూ అడ్డూ అదుపూ లేకుండా పరుగెత్తుతున్నాడు.

అయినా, ఎవరూ తరముకుండా ఊరికే ఎంత సేపని పరుగెత్తుతాడు? పరుగెత్తి పరుగెత్తి కాసేపటికి ఆయాసంతో రొప్పుతూ పరుగు చాలించాడు.

తరువాత-
గబగబ నడిచాడు
నడక వేగం తగ్గింది!
మెల్లగా నడిచాడు.
కాసేపటికి నడవడం కూడా కష్టమైంది!

మెల్లగా పాకుతున్నాడు- అతని ఒక్కొక్క కదలికా నిశ్చలత్వంలోకి ఇంకిపోతోంది!!

పద్మాసనంలోకి పొట్లంలా ముట్టుకున్న శరీరం!
ఆవిరి అయిపోయే ఆలోచన్లు
హృదయపు గర్భగుడిలోకి
మెట్లు మెట్లుగా దిగిపోతూ
సన్నబడుతున్న శ్వాస
పైపై సుఖాలకు ఆశపడి అర్రులు చాస్తూ
ఆత్మను అదిమిపట్టి అనుభవింపజూసేవాడూ,
మంచీ చెడూ న్యాయం ధర్మం అంటూ
సూచించి బోధించి తర్కించి శాసింపజూసేవాడూ-
ఇద్దరూ
చైతన్యానికి 'ద్వంద్వ' శాఖలై-
చీలిన చోటు నుంచీ
అడుక్కు జారుతూ
ఇంకా ఇంకా అట్టడుగుకి
పయనిస్తున్నారు..
వాళ్ళ మూలం వైపు!
అక్కడ-
ఇద్దరూ రెండు అబద్ధాలై
కరిగిపోయి-
తమ తల్లి పేరుతో కలిసి
ఏకత్వం పొందుతున్నారు!

పిడిని పట్టుకున్నవానికే కత్తి లొంగుతుంది
తనలో ఏకత్వం సాధించుకున్నవానికే
శాంతి దొరుకుతుంది.